క్లుప్తంగా

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టండి



సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: ఎన్నికలు ముగియడంతో ఇకపై గ్రామాల్లో ప్రజలకు చెందిన రెవెన్యూ సమస్యలపై వీఆర్ఓలు దృష్టి పెట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలోని వరగలిక్రాస్ రోడ్డులో ఉన్న రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం మండలంలోని వీఆర్ఓలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నికల ముందు నిలిచిపోయిన రెవెన్యూ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. డీటీ మస్తానయ్య, సర్వేయర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

దక్కిలి: మండలంలోని దక్కిలి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ లక్ష్మీనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు సూచనలు చేశారు. కొలతలు ప్రకారం పనులు పూర్తిచేసి దినసరి వేతనం రూ.300 పొందాలని సూచించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరూ పనికి వచ్చేలా చూడాలన్నారు. కూలీలకు సకాలంలో కూలి అందేలా మస్టర్లను కంప్యూటర్‌లో జనరేట్ చేయాలని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ షఫీ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

రాపూరు: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి కోరారు. రాపూరు మండలం ఏపూరు, పంగిలి, పెనుబర్తి గ్రామాల్లో మంగళవారం చిన్నారులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్లు పూర్తి అయిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. ఆరేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి గంధోత్సవం



నెలబల్లిలో ముస్తాబైన దర్గా

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామంలోని హుస్సేనమ్మ దర్గా వద్ద 54వ గంధోత్సవ కార్యక్రమం ఈనెల 20వ తేదీ నుంచి 22 వరకు జరుగుతుందని దర్గా కమిటీ తెలియజేసింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ హుస్సేనమ్మ కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు నమ్ముతారన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారని తెలిపారు. తొలిరోజు రాత్రి ఎంతో ఘనంగా గంధోత్సవంతోపాటు దర్గా వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. రెండోరోజు రాత్రి పాట కచ్చేరి, మూడో రోజు జబ్బర్‌దస్త్ ఫేమ్ వారిచే కామెడీ షో ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

ఓజిలి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మాజీ ఎంపీపీ పి.రమేష్, మాజీ సర్పంచ్ కొండూరు ఈశ్వర్‌రాజు అన్నారు. ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, టీడీపీ నేతలు అశోక్‌రాజు, మన్మథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధితో ఉద్యానానికి ఊతం



ఓడూరులో సాగులో ఉన్న నిమ్మ



కలవకొండ సాగులో ఉన్న మామిడి

- పండ్ల తోటల పెంపకంతో ఆదాయం
- ప్రభుత్వ నిధులతోనే మూడేళ్ల వ్యవసాయం

చిల్లకూరు : ఉపాధి హామీ పథకం కింద పేద, మధ్య తరగతి వారికి ఉపయోగపడే ఎన్నో పనులు చేస్తున్నారు. ఈ విషయాలపై పూర్తి స్థాయి అవగాహన లేక రైతులు వినియోగించుకోలేకపోతున్నారు. ఈక్రమంలో అధికారులు చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పిస్తూ పండ్ల తోటల పెంపకం వైపు దృష్టిసారించేలా చేస్తున్నారు. ముఖ్యంగా ఐదు ఎకరాలలోపు మెట్ట భూములు ఉన్న రైతులు తమ హక్కు పత్రాలను రెవెన్యూ అధికారులతో ధ్రువీకరించుకుని ఉపాధి అధికారులకు దరఖాస్తు అందజేస్తే పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. ఈ క్రమంలోనే మండలంలో పలువురు చిన్న, సన్నకారు రైతులు ముందుకు వచ్చి నిమ్మ, మామిడి, మునగ తోటలు సాగు చేస్తున్నారు. ఇంకా ఎవరైనా ముందుకు వస్తే అవకాశం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఉపాధి అధికారులు తెలిపారు.

రైతులకు అందించే మొక్కలు

పండ్ల తోటల పెంపకం చేపట్టేందుకు ముందుకు వచ్చిన రైతులకు తమ భూమి ఏ పంటకు అనుకూలంగా ఉంటుందో ముందుగా తెలుసుకోవాలి.



తక్కువ సమయంలోనే ఆదాయం తెచ్చే సాగులో ఉన్న మునగ

అప్పుడు ప్రభుత్వం ద్వారా అందించే పంటలైన జామ, నిమ్మ, మామిడి, దానిమ్మ, సీతాఫలం, సపోట, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్ లాంటి పండ్ల మొక్కలను అందజేస్తుంది. ఎకరాకు 70 మొక్కలు చొప్పున ఉచితంగా ఇస్తుంది.

మూడేళ్ల వరకు సాగు ఖర్చులు

పండ్ల తోటల పెంపకానికి ఎంపికైన రైతులు దుక్కులు దున్నుకోవడం మొదలు, మొక్కలకు గుంతలు తీయడం, నాటడం పనులకు ఉపాధి హామీ కింద పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. మూడడుగుల గుంత తీసిన అనంతరం మొక్కను నాటుకోవాలి. అనంతరం మొక్కల మధ్య కలుపు లాంటివి తీయడం, ఎరువులు, పురుగు మందుల ఖర్చులు, రవాణా చార్జీలు, రాయితీ రూపంలో ప్రభుత్వం రైతు బ్యాంకు ఖాతాకు నిధులు జమ చేస్తుంది. ఇలా మూడేళ్ల వరకు పంటకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. ఇలా రూ.లక్ష వరకు రైతుకు ఆదా అవుతుంది. మండలంలోని పలు గ్రామాల రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించేలా టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం



ఉపాధి హామీ పథకం కింద చిన్న, సన్నకారు రైతులు తమ మెట్ట భూముల్లో సిరులు పండించుకునే అవకాశం ఉంది. ఇందుకు రైతు తమ భూమికి చెందిన పట్టాదారు పాసు పుస్తకాలు, రెవెన్యూ అధికారుల వద్ద చిన్న, సన్నకారు రైతులకు చెందిన ధ్రువీకరణ పత్రం జాబ్ కార్డు తీసుకువస్తే మొక్కలు అందరికీ అందజేస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– గిరిబాబు, ఉపాధి ఏపీఓ, చిల్లకూరు

చందనాలంకరణలో శ్రీవారు



మాడ వీధుల్లో గరుడ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి మంగళవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం స్వాతి నక్షత్రం కావడంతో ఈ నక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం అయినందున స్వామివారి మూలమూర్తికి చందనంతో అలంకరించడం దేవస్థాన ఆచారం. స్వామివారికి ఉదయం అభిషేకం, చందన అలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి బంగారు గరుడ వాహనంపై శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ పెంచలకోనలోని మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో కోన వీధులు గోవిందనామస్మరణలతో మారుమోగాయి.

చిన్నప్పటి నుంచే పొదుపు నేర్చుకోవాలి



చిన్నారికి పొదుపు నగదును అందజేస్తున్న ఎంఈఓ

చిల్లకూరు: చిన్నారులు చిన్నప్పటి నుంచే పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని ఎంఈఓ సంపత్ కుమార్ తెలిపారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గత ఏడాది విద్యార్థులు కిడ్డీ బ్యాంకు ద్వారా దాచుకున్న నగదును లెక్కించి వారికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే చిన్నారులకు తమ తల్లిదండ్రులు ఇచ్చిన నగదును పొదుపు చేసుకునేలా అవగాహన కల్పించి వారితో పొదుపు చేయించిన ఉపాధ్యాయులు లక్ష్మణరావుకు అభినందనలు తెలియజేస్తునామని అన్నారు. అలాగే ఒకటి, రెండవ తరగతి చదువుతున్న చిన్నారులు ప్రతిరోజూ వారి వద్ద ఉన్న నగదును కిడ్డీ బ్యాంకులో దాచుకోవడం ద్వారా వారికి పొదుపుచేసుకుంటే భవిష్యత్తులో ఎంత ఉపయోగపడుతుందనే విషయం తెలుస్తుందని అన్నారు. అనంతరం కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ 5,237లను వారికి అందజేశారు. అలాగే పిచ్చుక సూర్య అనే చిన్నారి ఒక్కటే రూ. 1,020 దాచుకోవడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ నగదుతో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు కొనుగోలు చేసుకుని తల్లిదండ్రులకు కొంతభారం తగ్గించవచ్చని అన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన రైళ్లను ప్రవేశ పెట్టాలి



మాట్లాడుతున్న యూనియన్ నేతలు

గూడూరురూరల్: విజయవాడ నుంచి ప్రధాన పట్టణాలకు నూతన రైళ్లను ప్రవేశ పెట్టేలా చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజన్ జనరల్ సెక్రటరీ శంకర్రావ్ సూచించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఆయన ఆ సంఘ నాయకులతో సమీక్ష నిర్వహించారు. స్టేషన్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. అయన మాట్లాడుతూ సౌత్‌కోస్ట్ రైల్వే డివిజన్‌ను త్వరగా కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపై ప్రభుత్వం దృష్టిపెట్టి అభివృద్ధి సాధించాలని అన్నారు. వివిధ రంగాలలో అభివృద్ధి సాధించడంతో పాటు రాష్ట్రాల వారిగా క్లాస్‌ఫోర్ ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు పీఎం కిసాన్ లబ్ధి

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా అందుతున్న నగదు మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో జమవుతుందని మండల వ్యవసాయాధికారి కవిత తెలిపారు. పట్టణంలోని సూళ్లూరు ప్రాంతంలోని ఆర్బీకే కేంద్రంలో పీఎం కిసాన్ పథకం ద్వారా వచ్చే నిధులపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. వారణాసి నుంచి పీఎం నరేంద్రమోదీ 17వ విడత కిసాన్ పథకం నిధులు విడుదల చేశారన్నారు. ఏడాదికి ఒక రైతు కుటుంబానికి రూ.6వేలు నగదు అందుతుందన్నారు. మండలంలో మొదటి విడత కింద 3,356 మంది రైతులకు రూ.67.12 లక్షలు రైతుల ఖాతాల్లో లబ్ధి చేకురుతుందన్నారు. రెండో విడత సెప్టెంబర్, మూడో విడత డిసెంబర్ నెలలో విడుదల చేస్తారని తెలిపారు.

హంస వాహనంపై శ్రీనివాసుని చిద్విలాసం

గూడూరురూరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేంకటేశ్వరస్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని బజారువీధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో రెండవ రోజైన మంగళవారం శ్రీవారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించిన అనంతరం పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. సాయంత్రం స్వామి వారిని హంస వాహనంపై ఉంచి ఊరేగించారు. ఉభయకర్తలుగా పట్టణానికి చెందిన మిద్దె కుటుంబసభ్యులు వ్యవహరించారు.

పరిహారం కోసం బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు

చిల్లకూరు: మండలంలోని తొణుకుమాల పంచాయతీలోని ఉడతావారిపాళ్లపల్లికి చెందిన దళితులు పరిహారం కోసం మంగళవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సాగరమాల రహదారి పనుల్లో భాగంగా తమకు గతంలో పట్టాలు ఇచ్చిన భూమిని సేకరించారని అన్నారు. అయితే తమ భూమిని సేకరించే సమయంలో రహదారి పనులు చేపట్టే వారితో పాటు రెవెన్యూ అధికారులు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇంతవరకు పరిహారం ఇవ్వకుండానే పనులు పూర్తిచేస్తున్నారని, దీనిపై పలుమార్లు అధికారులతో పాటు రహదారి పనులు చేపట్టిన సంస్థ ప్రతినిధులను అడిగితే నాన్చుడి ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పట్టాలు ఇచ్చిన భూమిని ఇప్పుడు చెరువు పోరంబోకు కాబట్టి పరిహారం ఇవ్వవలసిన అవసరం లేదని అంటున్నారని, భూమికి బదులుగా ఎక్కడైనా భూమి కేటాయించాలని లేకుంటే తమకు పరిహారం అందించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై రెవెన్యూ అదికారులకు సమాచారం తెలిసి వారు అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ముగిసిన హాకీ శిక్షణ



శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌లతో చిన్నారులు

గూడూరురూరల్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గత 40 రోజులుగా నిర్వహించిన హాకీ శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. హాకీ కోచ్ దీపక్ ఆకాష్ మాట్లాడుతూ పట్టణంలోని చిన్నారులకు హాకీ అంటే ఎంతో ఇష్టమని అయితే శిక్షణ పొందే చిన్నారులకు దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తే ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేలా వారికి శిక్షణ ఇవ్వవచ్చని అన్నారు. ఈ ఏడాది శిక్షణకు సీనియర్ హాకీ క్రీడాకారులు ముందుకొచ్చి శిక్షణ పొందే వారికి కోడిగుడ్డు, పండ్లు, పాలు అందించారని అన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి చేతులమీదుగా సర్టిఫికెట్‌లు అందజేశారు.

కండలేరులో 6.429 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.429 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముత్యాలమ్మకు ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని శ్రీ సర్వ మంగళ సమేత శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామి, మరకదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.500 చెల్లించి రసీదు పొందాలని ఆయన తెలిపారు.

వీటి గతి అంతేనా?

- శిథిలావస్థలో ఫారెస్ట్ సిబ్బంది గృహాలు, అతిథి గృహం, వాహనాలు



నిరుపయోగంగా మరుగుదొడ్లు

దొరవారిసత్రం: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందాన నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి చెందిన వివిధ భవనాలు, సిబ్బంది గృహాలు, అధికారుల అతిథి గృహాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో లక్షల ప్రజాధనం వృథాకాక తప్పలేదు. ప్రతిఏటా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు తనిఖీలు, పర్యటనల పేరుతో చుట్టపుచూపుగా వచ్చి వెళ్లడం తప్ప నిరుపయోగంగా మారి వివిధ భవన నిర్మాణాల వైపు చూడకపోవడం గమనార్హం. మూతబడి నిరుపయోగంగా మారి క్రమేపి శిథిలావస్థకు చేరుకుంటున్న భవనాలు అన్నీ పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఆనుకునే ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇప్పటికే ఫారెస్ట్ అధికారులు విశ్రాంతి తీసుకునే విధంగా 20 ఏళ్ల కిందట నిర్మించిన అతిథిగృహం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మూలనపడి శిథిలావస్థకు చేరింది. అదేవిధంగా 25 ఏళ్ల కిందట స్థానిక ఫారెస్టు సిబ్బంది కోసం ఏడు వసతి గృహాలు నిర్మించారు. ఇందులో మూడు మాత్రం సిబ్బంది వినియోగించుకుంటున్నారు. మరొక గృహంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి మూడేళ్ల కిందటి వరకు వినియోగించారు. ఇప్పుడు అది కూడా మూతబడింది. వసతి గృహాల్లో ఒకటి అయితే ఎందుకు పనికిరాకుండా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. అంతేకాకుండా అధికారుల అతిథి గృహం వద్దనే చేతి బోరు, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. ఈ ట్యాంకు కింద భాగంలో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశారు.



పాడుబడిన వసతి గృహాలు

ఇది కూడా నిరుపయోగంగా ఉంది. ఇలాఉండగా రెండేళ్ల కిందట పక్షుల కేంద్రం ప్రధాన గేట్లకు సమీపంలో లక్షలు వెచ్చించి అన్ని వసతులతో మరుగుదొడ్లు నిర్మించారు. వీటిని ఎవరూ వినియోగించకపోవడంతో ఇవి కూడా నిరుపయోగంగా మారాయి. ఇవే కాకుండా వన్యప్రాణి విభాగం అధికారుల టాటా సుమో వాహనం, గ్రామాల్లో పక్షుల కేంద్రం గురించి ప్రచారం నిర్వహించే ప్రచార రథం వాహనాలు కూడా మూలనపడి శిథిలావస్థకు చేరాయి. దీంతో పాటు పక్షుల కేంద్రంలో 10ఏళ్ల కిందట సమావేశాలకు, నేచర్ క్యాంపులు వంటి వాటికి కోసం రూ.5 లక్షలు వెచ్చించి భవనం నిర్మించారు. ఇదికూడా వినియోగించకనే శిథిలాస్థకు చేరి నేలమట్టమైంది. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టి పెట్టి వినియోగంలోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.



నిరుపయోగంగా చేతిబోరు, టికెట్ కౌంటర్



మూల పడిన ప్రభుత్వ వాహనం



శిథిలావస్థకు చేరిన అతిథి గృహం